క్లుప్తంగా

వేబ్రిడ్జిల నిర్మాణానికి తీర్మానం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ పరిధిలోని ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేటలో వేబ్రిడ్జిల నిర్మాణానికి తీర్మానం చేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీకాంత్ బుధవారం తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత అధ్యక్షతన నిర్వహించిన పాలకమండలి సమావేశంలో ఎల్లారెడ్డిలో నూతనంగా షాపింగ్ కాంప్లెక్స్, నూతన కార్యాలయ భవన నిర్మాణానికి తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజు, డైరెక్టర్లు తదితరులున్నారు.

దివ్యాంగ విద్యార్థులకు కిట్ల పంపిణీ



బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని భవితసెంటర్‌లో బుధవారం దివ్యాంగ విద్యార్థులకు మంజూరైన కిట్లను మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరావు పంపిణీ చేశారు. 10టీఎల్ఎం కిట్లతో పాటు 3 సీపీ చైర్‌డీలక్స్‌లను దివ్యాంగ విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు డా.గంగాధర్, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు తోట వసంత్‌కుమార్, అందె అనిల్, వెంకటపద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వినతి



కామారెడ్డి టౌన్: జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం జిల్లా ఇన్‌చార్జి డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు పంపరి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు వేసవి శిక్షణ కార్యక్రమ శిబిరాలను జిల్లాలోనే నిర్వహించాలన్నారు. అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ఉపాధ్యాయులకు ఈఎల్ ప్రొసీడింగ్ సత్వరమే కేటాయించాలన్నారు. ఇటీవల కులగణన నిర్వహించిన ఎన్యూమరేటర్లకు ఎన్యూమరేషన్ వెంటనే చెల్లించాలని కోరారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. పోక్సో చట్టం కింద ఉపాధ్యాయుల కేసులలో పూర్తి స్థాయి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్న సందర్భంగా డీఈవోను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవులా, ముజిబొద్దీన్, రాజ్ కుమార్, రాజేశ్, ప్రభాకర్, గఫూర్ శిక్షక్ తదితరులు పాల్గొన్నారు.

26న ప్రైవేట్ ఫైనాన్స్ జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: చైతన్య ఇండియా ఫిన్ క్రెడిట్ లిమిటెడ్ బ్రాంచి మేనేజర్, కస్టమర్ రిలేషన్‌షిప్ ఆఫీసర్ల నియామకం కోసం ఈనెల 26న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఉపాధి కల్పనాధికారి మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పాసై, 18 నుంచి 38 ఏళ్లలోపు ఉన్న యువతి,యువకులు హాజరు కావచ్చని, వివరాలకు 76719 74009 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

ఘనంగా ఆంగ్ల దినోత్సవం



సదాశివనగర్/కామారెడ్డి అర్బన్: మండలంలోని మర్కల్ గ్రామ స్టేజీ వద్ద గల మహిళ డిగ్రీ గురుకుల కళాశాలలో బుధవారం అంతర్జాతీయ ఆంగ్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడుతూ...మహాకవి, నాటక రచయిత విలియం షేక్‌స్పియర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని కామారెడ్డి డిగ్రీ కాలేజీలో కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ ఆధ్వర్యంలో విలియం షేక్ స్పియర్ జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా జాతీయ స్థాయి 3 రోజుల ఆన్‌లైన్ క్విజ్ పోటీలను కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ వైస్ ప్రిన్సిపల్ కే.కిష్టయ్య ప్రారంభించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఆంగ్ల విభాగం అధిపతి విశ్వప్రసాద్, అధ్యాపకులు ఫర్హీన్ ఫాతిమా, సత్యనారాయణ, ప్రభాకర్‌గౌడ్, మహిళ డిగ్రీ గురుకుల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మీనా, అకాడమిక్ కో–ఆర్డినేటర్ వనజ, ఇంగ్లీష్ విభాగపతి హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

నీటి వసతి లేక ఇబ్బందులు

- బీటలు వారిన ధోబీఘాట్ల నీళ్ల కుండీలు
- పని చేయని బోరు మోటారు
- చెరువులను ఆశ్రయిస్తున్న రజకులు
- పట్టించుకోని అధికారులు



సదాశివనగర్ శివారులో నిరుపయోగంగా మారిన ధోబీఘాట్లు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్‌తో పాటు ధర్మారావ్‌పేట్, ఉత్తునూర్, వజ్జపల్లి, కుప్రియాల్, పద్మాజివాడీ తదితర గ్రామాల్లో గత 14 ఏళ్ల క్రితం నిర్మించిన ధోబీఘాట్లు నిరుపయోగంగా మారాయి. నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. రజకుల సంక్షేమం కోసం అప్పటి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఊరురా ధోబీఘాట్లను నిర్మించింది. ధోబీఘాట్లను నిర్మించినంత మాత్రాన వాటికి నీటి వసతి కల్పించడంలో అధికారులు దృష్టి సారించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వం ధోబీఘాట్లకు ప్రత్యేకంగా బోరు వేయించకపోవడంతో నీటి సమస్య తలెత్తింది. కొన్ని గ్రామాల్లో ధోబీఘాట్లకు నీటి సదుపాయం కోసం బోరు బావులను తవ్వించిన ప్రయోజనం లేకుండా పోయింది. ధోబీ ఘాట్ల వద్ద బోరు బావులు చెడిపోతే పంచాయితీ పాలకవర్గాలు పట్టించుకోవడం లేదని రజకులు వాపోతున్నారు. బోరు బావులు చెడిపోవడంతో మరమ్మతులు చేయించండానికి ఇటు పంచాయితీ పాలకవర్గాలు, ప్రజాప్రతినిధులు ముందుకు రాకపోవడంతో బోర్లు తుప్పుపట్టి పోయాయి. ధోబీఘాట్ల వద్ద నీటి వసతి లేకపోవడంతో రజకులు చెరువులు, కుంటలను ఆశ్రయిస్తున్నారు. చెరువు, కుంటల్లో ప్రమాదపుటంచున బట్టలు ఉతకాల్సి వస్తోందని రజకులు పేర్కొంటున్నారు.

ధ్వంసమైన బోర్లు...

రజకులకు బట్టలు ఉతకడానికి సౌకర్యార్థం నిర్మించిన నీళ్ల కుండీలు బీటలు వారాయి. వేసిన బోరు బావులు తుప్పుపట్టిపోయాయి. పైపులైన్‌లు పనికి రాకుండా పోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాము ధోబీఘాట్ల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉందని వారు చెబుతున్నారు. గతంలో నీటి వసతి ఉన్నప్పుడు కనీసం కొంత వసతి కల్పించారు. ప్రస్తుతం గత కొన్ని సంవత్సరాలుగా ధోబీఘాట్ల గురించి పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడని వారు పేర్కొన్నారు.

పట్టించుకునేటోళ్లు లేరు



మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నిర్మించిన ధోబీఘాట్లను ఉపయోగంలోకి వచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలి. ధోబీఘాట్ల వద్ద రజకులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలి. – వున్నం రాజయ్య, రజక సంఘం జిల్లా బాధ్యులు

బాయిల కాడ ఉతుక్కుంటున్నం



ధోబీఘాట్ల దగ్గర నీళ్ల వసతి లేక బాయిలకాడ బట్టలు ఉతుక్కుంటున్నం. అసలు మా గురించి పట్టించుకునేటోళ్లే లేకుండా పోయిండ్రు. ఇప్పటికైన అధికారులు పట్టించుకొని వసతులు ఏర్పాటు చేయాలి. – సాకలి చిన్న సాయిలు, సదాశివనగర్

ఏండ్ల సంది వట్టిగ ఉంటున్నయ్



ధోబీఘాట్లు కట్టినప్పుడు కొద్ది రోజులు మాత్రమే మంచి నీళ్ల వసతి ఉండే. అక్కడికే పోయి బట్టలు ఉతికెటోళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. బోర్లు వేయించాలి. నీటి వసతి ఉంటేనే ఘాట్ల వద్దకు వెళ్లి బట్టలు ఉతకడానికి అవకాశం ఉంటుంది. నీటి వసతి కల్పిస్తే రజకులకే కాదు మూగజీవాలకు కూడా నీటి వసతి ఏర్పడుతోంది. – ఇస్త్రీ రాజు, సదాశివనగర్

ఆటపాటలతో సృజనాత్మక విద్య



మాట్లాడుతున్న సీడీపీవో స్వరూపరాణి



వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

లింగంపేట/ఎల్లారెడ్డిరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో సృజనాత్మక విద్య అందిస్తున్నామని ఎల్లారెడ్డి సీడీపీవో స్వరూపారాణి అన్నారు. బుధవారం ఆమె లింగంపేట మండలం లింగంపల్లి గ్రామంలో అమ్మ ఒడి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన, సామూహిక సీమంతాలు, పోషణ్ పక్వాడ్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఎల్లారెడ్డి మండలం వెంకటాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలను నిర్వహించారు. గ్రామంలోని గర్భిణులకు అంగన్‌వాడీ సిబ్బంది సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, బాలింతలు, గర్భిణులు చిన్నారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు సెలవులు ఇవ్వాలని వినతి

బాన్సువాడ : అంగన్‌వాడీ టీచర్లకు మే నెలలో సెలవులు ఇవ్వాలని బుధవారం బాన్సువాడ సీడీపీవో సౌభాగ్య లక్ష్మికి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఖలీల్ మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా పెరిగినందున ప్రభుత్వ పాఠశాలతో సమానంగా అంగన్‌వాడీ టీచర్లకు సెలవులు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. గురువారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ అధ్యక్షురాలు మహాదేవి, సభ్యులు శివగంగ, వజ్ర, రాధ ఉన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి




కొండాపూర్ లో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

రాజంపేట: రైతులు జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్గొండ సింగిల్‌విండో చైర్మన్ కందిశివరాములు అన్నారు. బుధవారం ఆర్గొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని కొండాపూర్ గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.తహసీల్దార్ సతీష్ రెడ్డి, ఏంఎంసీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, ఏవో శృతి,సొసైటీ డైరెక్టర్లు, ఏఈవో రజిత, సీఈవో సాయిలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కదలికలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి



లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో ప్రగతి పత్రం అందజేస్తున్న ఎంఈవో షౌకత్‌అలీ



బోర్లం ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులతో ఇన్‌చార్జి డీఈవో అశోక్

బాన్సువాడ రూరల్: వేసవి సెలవుల్లో విద్యార్థుల కదలికలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని జిల్లా ఇన్‌చార్జి డీఈవో అశోక్ అన్నారు. బుధవారం ఆయన బోర్లం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఏప్రిల్ 23 పాఠశాలలకు చివరి పనిదినం కావడంతో తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు సాధించిన మార్కులపై చర్చించారు. వారికి ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేశారు.

విద్యార్థులకు ప్రగతి పత్రాల అందజేత

సదాశివనగర్/తాడ్వాయి/లింగంపేట/బీబీపేట : విద్యార్థులకు కేవలం చదువే కాకుండా దానికి తోడుగా ఇంటి పనులను కూడా నేర్పించాలని, వేసవి సెలవుల్లో వారిపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఇంటి వద్ద వృధాగా ఉండకుండా పుస్తకాలను చదువుకోవాలని తాడ్వాయి కస్తూర్బా పాఠశాల ప్రిన్స్‌పల్ రాణి అన్నారు. పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేసినట్లు మండల విద్యాధికారి షౌకత్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న నైపుణ్య శిక్షణ(సమ్మర్ క్యాంపు) హాజరు కావాలని సూచించారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు విద్యార్థులకు క్రీడలు, చిత్రలేఖనం, యోగా, కరాటే, వ్యక్తిత్వ వికాసం తదితర సృజనాత్మక నైపుణ్యాలపై శిక్షణ ఇస్తామన్నారు. బీబీపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యా సంవత్సరం చివరి పని దినాన్ని పురస్కరించుకొని గ్రాడ్యుయేషన్ డే, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ విద్యా సంవత్సరం పాఠశాలలో చేపట్టిన కార్యక్రమాలను హెచ్ఎం రామేశ్వర్ రెడ్డి వివరించారు. అనంతరం విద్యార్థినులకు ప్రగతి పత్రాలు అందజేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉగ్రదాడికి నిరసనగా క్యాండిల్ ర్యాలీ



నాగిరెడ్డిపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



మద్నూర్‌లో.. యువకులు



మాచారెడ్డిలో..



ఎల్లారెడ్డిలో .. నాయకులు



జిల్లా కేంద్రంలో ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

నాగిరెడ్డిపేట/మద్నూర్/మాచారెడ్డి: జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రదాడికి నిరసనగా పలు చోట్ల క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రంలో బుధవారంరాత్రి బీజేపీ ఆధ్వర్యంలో, మాచారెడ్డిలో, మద్నూర్‌లో స్థానిక గాంధీచౌక్ నుంచి పాత బస్టాండ్ మీదుగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి అర్పించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరుతూ వారు ర్యాలీ కొనసాగించారు.ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి గాంధీచౌక్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ, బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం

ఎల్లారెడ్డిరూరల్: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అమానుషమని బీజేపీ నాయకులు బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో ఉగ్రవాదుల దాడిలో అమరులైన వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని అన్నారు. బీజేపీ నాయకులు రాజేశ్, నర్సింలు తదితరులున్నారు.

కామారెడ్డి అర్బన్ : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు, మృతులకు నివాళులు అర్పిస్తున్నట్టు విశ్వహిందూ పరిషత్ కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు వడ్ల వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాదులు, వేర్పాటువాదులు భారత్ వైపు కన్నెత్తి చూడకుండా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

కామారెడ్డి టౌన్: జమ్మూకాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ ఏబీవీపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేశారు. హిందువులపై దాడి జరగడం బాధాకరమని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు ప్రత్యూష అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, ఇందూరు విభాగ్ కన్వీనర్ శశిధర్, బీజేపీ, ఏబీవీపీ నాయకులు తదితరులున్నారు.

విద్యార్థుల ఇంటిబాట



బాన్సువాడ రూరల్/తాడ్వాయి : విద్యాసంవత్సరానికి ఏప్రిల్ 23 చివరి పనిదినం కావడంతో ప్రభుత్వం అన్ని పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలకు సెలవుప్రకటించింది. దీంతో బుధవారం బాన్సువాడ మండలంలోని కొయ్యగుట్ట, బోర్లంక్యాంపులోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కొత్తాబాదిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, తాడ్వాయి కస్తూర్బా, గురుకుల పాఠశాల విద్యార్థులు పెట్టెలతో ఇంటిబాట పట్టారు. విద్యార్థులు ఇంటికి వెళ్లడానికి సిద్ధమవ్వగా, వారిని తీసుకెళ్ళడానికి వచ్చిన తల్లిదండ్రులతో విద్యాలయాలు కిటకిటలాడాయి.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ ఈఏపీసెట్



కామారెడ్డి టౌన్ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ సాందీపని జూనియర్ కళాశాలలో ఈఏపీసెట్ ఆన్‌లైన్ మోడల్ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ముదాం అరుణ్ మాట్లాడుతూ విద్యార్థులకు మోడల్ పరీక్షలతో అవగాహన పెరుగుతుందన్నారు. 150 మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సాందీపని విద్య సంస్థల డైరెక్టర్ హరిస్మరణ్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబా, ఎస్ఎఫ్ఐ నాయకులు రాహుల్, మణికంఠ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామసమీపంలో గల జగ్గనిచెరువు వద్ద రజకసంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం మడలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేదమంత్రాల మధ్య స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. రజకసంఘం సభ్యులు, భక్తులు ప్రత్యేకపూజలు చేశారు.

నేడు ఆలయ హుండీ లెక్కింపు

మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలోని హుండీలను గురువారం లెక్కిస్తామని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆలయానికి విరాళం

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం భక్తులు పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కోసం సికింద్రాబాద్ లోని అల్వాల్ కు చెందిన నర్సింగరావు అరుణలు రూ. 11వేలు ఆలయ సిబ్బందికి విరాళంగా అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితా పరిశీలన



జలాల్‌పూర్‌లో గుడిసెను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రభాకరచారి

నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి/ తాడ్వాయి/గాంధారి : నాగిరెడ్డిపేట మండలం జలాల్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఇందిరమ్మ కమిటీ ఎంపికచేసిన జాబితాపై బుధవారం స్థానిక ఎంపీడీవో ప్రభాకరచారి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జాబితాలో పేర్లు కలిగినవారి ఇళ్లను ఆయన పరిశీలించారు.ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్, ఆజామాబాద్ గ్రామాలలో ఎంపీవో ప్రకాష్ ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకున్న వారికి సంబంధించిన వారి వివరాలను పరిశీలించారు.తాడ్వాయి మండలం బ్రహ్మాజివాడీ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ పరిశీలించారు.గాంధారి మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల అర్హులను గుర్తిస్తున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాల ఆధారంగా ఇంటింటికి వెళ్లి అర్హులను గుర్తించి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేడు భూభారతి పై అవగాహన

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం భూ భారతి చట్టం –2025 పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు ఎల్లారెడ్డిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎల్లారెడ్డి: పట్టణంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకటస్వామి బుధవారం తెలిపారు. విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించే పనులలో భాగంగా ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

గుడిసెలు దహనం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో ప్రభుత్వం కేటాయించిన భూముల్లో పూరి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తూ వారి పూరి గుడిసెలను దహనం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన భిక్కనూరు మండలం జంగంపల్లిలో విలేకరులతో మాట్లాడారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

దోమకొండ: మండల కేంద్రంలో జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ బాలిక పాఠశాలలో విధులు నిర్వహించిన జీఏఎస్ ప్రభావతి బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ఉపాధ్యాయులతో పాటు మాజీ జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ సన్మానించి మాట్లాడారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కాంగ్రెస్ నాయకులు తూర్పు రాజు, పరమేశ్వర్, సాయికుమార్, మాజీ సర్పంచ్ సంజీవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రూ. రెండు కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు.

తాడ్వాయిలో చలివేంద్రం ప్రారంభం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు చలివేంద్రం ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేసిన రైతులు

పిట్లం(జుక్కల్): మండలంలోని చిల్లర్గి గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రం వద్ద బుధవారం రైతులు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎకరాకు జొన్న కొనుగోలు పరిమితిని 8 క్వింటాళ్ల నుంచి 14 క్వింటాళ్లకు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు.

గాలికుంటు వ్యాధి టీకాల పంపిణీ

నస్రుల్లాబాద్/ఎల్లారెడ్డిరూరల్/: నస్రుల్లాబాద్ మండలం సంగం గ్రామంలో మండల పశువైద్యాధికారి మహేష్ బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఎల్లారెడ్డి మండలం సబ్దల్‌పూర్, వెంకటాపూర్ గ్రామాలలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు వెటర్నరీ డాక్టర్ అర్చన తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.